



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఎం.ఇంతియాజ్



డిఆర్‌సి ఎప్పుడో..?

◆ఐదు మాసాలైనా జిల్లా అభివృద్ధిపై సమీక్ష లేదు

◆కనీస ప్రస్తావన చేయని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాధారణంగా ప్రభుత్వం వచ్చిన కొత్తలో జిల్లాలోని సమస్యలపై సమీక్ష జరిపి.. భవిష్యత్ ప్రణాళికపై దృష్టి సారిస్తారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు మాసాలు పూర్తయ్యింది. ప్రభుత్వం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని నియమించింది. మంత్రి టిజి.భరత్ ఇన్‌ఛార్జీగా ఉన్నారు. ఆయన ఆదివారం నాడు జిల్లాకు విచ్చేశారు. అయితే ఆయన ఒక సామాజి తరగతికి చెందిన సమావేశంలో పాల్గొని వెళ్లిపోయారు. అయనతో కలసిన అధికారులతో ముచ్చటించారు. జిల్లా అభివృద్ధి కమిటీ(డిఆర్‌సి) నిర్వహించడంపై మాత్రం దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. సత్యసాయి జిల్లా వరకు చూస్తే అక్కడి ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇది వరకే విచ్చేసి డిఆర్‌సిని నిర్వహించారు. అంతకు మునుపు జిల్లా మంత్రులు సవితమ్మ, సత్యకుమార్‌లు జిల్లా పరిస్థితులపై ఒక సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా వరకు చూస్తే ఇప్పటి వరకు జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్‌గానీ, ఇటు ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్‌గాని ఆ వైపుగా దృష్టి సారించలేదు.

ఎక్కడి సమస్యలక్కడే..

అనంతపురం జిల్లాలో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలు ప్రకృతి వైపరిత్యాల మూలంగా రెండు రకాలుగా నష్టపోయారు. ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటిస్తే దానిపైనా విపక్షాలు తప్పుబడుతున్నాయి. అన్ని మండలాలను కరువు మండలలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే కీలకమైన ఆగస్టు నెలలో వర్షాలు పడకపోవడంతో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం పడిపోయింది. అదే విధంగా వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. వాటికి పరిహారం అందాల్సి ఉంది. ఇక సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. అనేక ఇబ్బందులు సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలోనూ ఉన్నాయి. ఇవి కాకుండా తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. సత్యసాయి తాగునీటి పైపులైన్‌లు కూడా మార్చాల్సి ఉంది. ఈ విషయం స్వయంగా ఆర్థిక శాఖ మంత్రి తన సొంత నియోజకవర్గంలో పరిశీలనలోనే తేలింది. ఇది ఆ ఒక్క నియోజకవర్గానికే పరిమితమై లేదు. జిల్లా అంతటా అదే పరిస్థితి నెలకొని ఉంది. దీనిపై ప్రభుత్వం ఏ రకంగా చర్యలు తీసుకుంటుందన్నది ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలుగానున్నాయి. ఇక పారిశ్రామిక ప్రగతికి అనేక హామీలు గతంలో ఇచ్చియున్నారు. కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇది డీ.హీరేహల్ మండలంలో ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమి చేస్తారన్నది ప్రశ్నార్థంగానే ఉంది. ఇలా అనేక సమస్యలు జిల్లాలో నెలకొని ఉన్నాయి. వీటిపై కొత్త ప్రభుత్వంలో చర్చించి రాబోయే రోజుల్లో ప్రజలకు పరిష్కార మార్గాలను ఏమి తీసుకోబోతున్నారన్నది తెలియాలంటే డిఆర్‌సి జరగాల్సి ఉంది. అయితే ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖాలాల్లేవు. ఇప్పటికైనా జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తారా మరింత కాలం వేచి చూడాల్సిందేనన్నది తెలియాల్సి ఉంది.

నిర్వాసితులపై నిర్లక్ష్యం

◆పునరావాసం కల్పించి ఆదుకోవాలి

◆సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గోరంట్ల మండల పరిధిలోని పాలసముద్రం వద్ద ఏర్పాటు చేసిన నాసన్, బెల్, ఎయిర్ బస్, కంపెనీల ఏర్పాటు కోసం భూములు, నివాసాలు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో ప్రభుత్వాలు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ప్రశ్నించారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ పాలసముద్రం గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు నాసన్, బెల్, ఎయిర్ బస్సుల కోసం సాగు భూములిచ్చి నిర్వాసితులు అయ్యారన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా వారిని పట్టించుకోవడం లేదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజ్ అమలు చేయాల్సి ఉందన్నారు. పనారావాసం కోసం బాధిత రైతుల పేర్లను ఎంపిక చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ అందిచలేదన్నారు. బాధితులపై అధికారులు వివక్ష చూపించి కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్, ఆర్డీవో, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ విజయవాడ వారు ఆదేశాలు ఇచ్చినా వాటిని పట్టించుకోని పరిస్థితి ఉందన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ భూములు కోల్పోయి నోటిఫికేషన్‌లో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరినీ అర్హులుగా గుర్తించి, నివేదికను జాయింట్ కలెక్టర్‌కు పంపామన్నారు. పాలసముద్రం గ్రామాన్ని డిసెంబర్ 7న సందర్శించి ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కోశాధికారి సాకే వెంకటేశులు, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం పెనుగొండ నియోజకవర్గ కార్యదర్శి కొండా వెంకటేశులు, వ్యవసాయ మహిళా కార్మిక సంఘం నాయకులు మామిళ్లకుంట రమాదేవి, వెంకట లక్ష్మమ్మ, వెంకట రాముడు, గంగమ్మ, సుజాతమ్మ, అచ్చమ్మ పాల్గొన్నారు.



విజయ కేతం చూపుతున్న కియా ప్రతినిధులు

కియా ఇండియా ఘనత

లక్ష సికెడి వాహనాల ఎగుమతి : చీఫ్ సేల్స్ ఆఫీసర్

ప్రజాశక్తి-పెనుకొండ

కియా ఇండియా జూన్-2020లో రవాణా ప్రారంభించినప్పటి నుంచి లక్ష యూనిట్ల సికెడి వాహనాలను ఎగుమతి చేసినట్లు చీఫ్ సేల్స్ ఆఫీసర్ జున్సుచో తెలిపారు. ఈ మైలురాయిని అధిగమిం చిన సందర్భంగా సోమవారం కియా ప్రతినిధులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చీఫ్ సేల్స్ ఆఫీసర్ మాట్లాడుతూ భారత్‌ను కీలక ఎగుమతి కేంద్రంగా స్థాపించేందుకు కంపెనీ చేస్తున్న కృషికి ఈ ఘనత నిదర్శనమన్నారు. ప్రపంచవ్యాప్తంగా కంపెనీ సికెడి ఎగుమతుల్లో 50 శాతం వాటా ఉన్న కియా కీలకమైందన్నారు. 2024లో ఉజ్‌బెకిస్తాన్, ఈక్వెడార్, వియత్నాం మార్కెట్‌లో 38వేల సికెడి యూనిట్లను ఎగుమతి చేయాలని భావిస్తోందన్నారు. కియా ఇండియా మార్కెట్ సామర్థ్యం, పోటీ ధరలకు ఈ విజయం నిదర్శనం అన్నారు. కియా కార్పొరేషన్ ఇండియా కీలకమైన మార్కెట్, బలమైన సేల్స్ డ్రైవ్ మాత్రమే కాకుండా అభివృద్ధి చెందుతున్న ఎగుమతి కేంద్రంగా కూడా పని చేస్తుందన్నారు. సెల్టోస్, సోనెట్, కారెన్స్ వంటి మోడళ్లను అంతర్జాతీయ మార్కెట్‌లో పటిష్టంగా ప్రదర్శించడం గర్వం గా ఉందన్నారు. గ్లోబల్ ఆటోమోటివ్ వాల్యూ చైన్‌లో భారత్ స్థానాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ ఎగుమతి విధానాలకు కృతజ్ఞతలు తెలిపారు. 2030 నాటికి ఎగుమతులను రెట్టింపు చేయడానికి ఆఫ్రికాకు సికెడి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 3.67 లక్షల యూనిట్లతో అంతర్జాతీయంగా రూపొందించిన అధిక నాణ్యత వాహనాలను అందించే 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు బలమైందని తెలిపారు.



సమీక్ష, సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, గుండుమల

13న భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

డిసెంబర్ 13వ తేదీ జరిగే మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి ఆలయాల బ్రహ్మోత్సవాలపై సోమవారం ఆలయంలో సమీక్ష, సమావేశం నిర్వహిం చారు. సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని మాట్లా డారు. అంతకుముందు ఆలయ అర్చకులు, సిబ్బంది వారికి స్వాగతం పలికి సత్కరించారు. సమావేశం లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రవీంద్రారెడ్డి, ప్రసాద్, నర్సాగౌడ్, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

గుడిబండలో స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి-గుడిబండ

ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గుడిబండలో స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం నిర్వహిం చారు. ఎకాలజీ టెక్నికల్ డైరెక్టర్ మురళీనాథ్, ఎటిఎల్ మీనాక్షి హాజరై సమాజంలో మహిళలపై జరుగు తున్న దాడులు, గృహహింస, తదితర అంశాలపై మాట్లాడారు. మహిళల పై జరుగుతున్న దాడులను ఎలా అరికట్టాలి-అందులో పోలీసుల పాత్రపై వివరించారు. ఎటిఎల్ సావిత్రి మాట్లాడుతూ ప్రభు త్వాలు మహిళా చట్టాలను మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిటి సంస్థ అధికారి

అహుడా చైర్మన్‌గా వరుణ్ ప్రమాణస్వీకారం

కూటమినేతల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ(అహుడా) ఛైర్మన్‌గా జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ అంబేద్కర్ ఫ్లైఓవర్ నుంచి అహుడా కార్యాలయం వరకు అభిమానులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాల నడుమ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కాలవ శ్రీనివాసులు, బండారు శ్రావణి శ్రీ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా బిజెపి అధ్యక్షులు సంధిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, రాయలసీమ ప్రాంతీయ మహిళా కన్వీనర్ పెండ్యాల శ్రీలత తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిసి.వరుణ్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో తాను అహుడా ఛైర్మన్ బాధ్యతలు చేపట్టానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో అనంతపురం- హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో అభివృద్ధి చేస్తూ ప్రజా సేవ చేయనున్నట్లు తెలిపారు. టిసి వరుణ్ అహుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తల సంబరాలు మిన్నంటాయి.



అహుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న టిసి.వరుణ్

కియా అనుబంధ సంస్థలో ప్రమాదం

ఆలస్యంగా వెలుగులోకి.. కాలు తెగి కార్మికుడి ఆర్తనాదాలు..సోషల్ మీడియాలో వీడియో వైరల్



కాలికి గాయంతో కిందపడిపోయిన కార్మికుడు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని చాలకూరు సమీపంలో ఉన్న కియా అనుబంధ సంస్థలో ఓ కార్మికుడు తీవ్ర రక్తస్రావంతో విలవిల్లాడుతూ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వేడుకుంటున్న ఓ వీడియో రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాలు.. కియా అనుబంధ సంస్థ అయిన అడాప్ట్ ఆటో కాంపోనెంట్ సంస్థలో శనివారం అర్ధరాత్రి కార్మికులు సూరజ్‌గోస్వామి, ఉమేష్ గాయపడ్డారు. కాలుకు తీవ్ర గాయమై సూరజ్‌గోస్వామి తీవ్ర రక్తస్రావంతో విలవిల్లాడుతూ తనను వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలని చేతులెత్తి వేడుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది చూసిన కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ఆయా కంపెనీల యాజమాన్యాల వైఖరిపై మండిపడుతున్నారు. కియా అనుబంధ సంస్థల్లో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని, వాటిని యాజమా న్యాలు గుట్టుగా ఉంచుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ వేతనాలతో శ్రమదోపిడీకి పాల్పడడంతో పాటు కార్మికులకు రక్షణ కల్పించకపోవడం, ఏదైనా ప్రమాదం జరిగితే వైద్యం అందించక పోవడం దుర్మార్గమన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా కంపెనీల్లో కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని, కార్మికుల భద్రత పట్ల బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

'అడాప్ట్' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

పెనుకొండ టౌన్ : కియా అనుబంధ సంస్థ అడాప్ట్ ఆటో కాంపోనెంట్ సంస్థ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవో గిరికి వినతి పత్రం ఇచ్చారు. రమేష్ మాట్లాడుతూ ఆ సంస్థలో కార్మికులు సురాజ్‌గోస్వామి, ఉమేష్ కాళ్లకు తీవ్ర గాయాలు కాగా తోటి కార్మికులు సూపర్‌వైజర్ ధర్మేంద్రను ఆసుపత్రికి తీసుకెళ్లాలని కోరినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా బయటకు పొక్కకుండా యాజమాన్యం కార్మికులను బెదిరించి, భయపెట్టి నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కావున కియా అనుబంధ సంస్థల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాయకులు మహబూబ్ బాషా, అజయ్, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయ ఏవో గిరికి వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి

ప్రజాశక్తి-మడకశిర

ఉన్నత శిఖరాల ను అధిరోహించేందుకు ఎన్‌సిసి దోహదం చేస్తుందని హెడ్ కానిస్టేబుల్ సుంద రం తెలిపారు. ఎన్‌సిసి డే సందర్భంగా సోమవారం శ్రద్ధ ఇంటలెక్చువల్ స్కూల్ ఛైర్మన్, న్యాయవాది రాధాకష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వాల్మీకి సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాల్మీకి సర్కిల్‌లో ఎన్‌సిసి విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ సుందరం మాట్లాడుతూ ఎన్‌సిసి క్రమశిక్షణకు మారుపేరు అన్నారు. ఎన్‌సిసితో సేవాభావం పెరుగుతుందన్నారు. శ్రద్ధ కళాశాల ప్రిన్సిపల్ కాంత్‌రాజ్, ఎన్‌సిసి టీచర్ చిరంజీవి, వైస్ ప్రిన్సిపల్ సచిన్, పద్మరాజ్, శ్రీనివాస్, దేవరాజ్‌నాయక్, మల్లికార్జున, సురేందర్‌రెడ్డి, కీర్తి, మెలిన్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపట్టిన శ్రద్ధ స్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు

పెనుకొండ పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్లు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం పెనుకొండ పోలీస్ స్టేషన్‌కు 10 బారికేడ్లను ఎస్ఐ వెంకటేశ్వర్లకు అందజేశారు. కార్యక్రమంలో క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ గౌస్‌పీర్, ఏరియా మేనేజర్ చంద్రశేఖర్, బ్రాంచి మేనేజర్ శ్రీనివాసులు, పెనుకొండ బ్రాంచి సిబ్బంది, జమిందార్ దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకు బారికేడ్లు అందిస్తున్న ఆర్ఎం గౌస్‌పీర్



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి సవిత

ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఎన్నికల హామీల అమలు, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారున. స్థానిక సాయినగర్‌లో జరుగు తున్న రోడ్లు, డ్రెయినేజీ పనులను సోమవారం మంత్రి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మండల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రూ. 1.2 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు డ్రెయినేజీ పనులు ప్రారంభించామన్నారు. వైసిపి హయాంలో సోమందేపల్లి చెరువులో నీరున్నా 400 ఎకరాలను బీడుగా పెట్టారని, ప్రస్తుతం ఆయా పొలాలకు పైపుల ద్వారా నీరిచ్చే ఏర్పాటు చేశామన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తుంద న్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, పట్టణ అధ్యక్షుడు వడ్డే సూరి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, నాయకులు వెంకటరాముడు, నీరుగంటి చంద్ర, సూర్య నారాయణ, కిష్ట, రంగప్ప, సిసి హరి, హరికృష్ణ, సర్పంచి నరసింహులు, రంగనగోపాల్, గట్టు మహేం ద్ర, కోతుల మూర్తి, నిమ్మకాయల ప్రసాద్, ప్రభాకర్, చలపతి, రామంజి, జనసేన మండల కన్వీనర్ జబీవుల్లా, నాగరాజు, అంజి, మద్దిలేటి, మోహన్ పాల్గొన్నారు.

మంత్రి సవితకు నోటు పుస్తకాలు అందజేత

మంత్రి సవితకు తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి.హరిదాస్ వినూత్న రీతిలో విద్యార్థు లకు అవసరమైన నోటు పుస్తకాలు అందించి సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ ఎవరైనా పూల బొకేలు, పూలమాలలు ఇవ్వడం కంటే ఇలా నోటు పుస్తకాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలపాలన్నారు. ఇకపై తనకు శుభాకాంక్షలు తెలిపే వారు వీలైతే పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తీసుకురావాలని, వాటిని పేద విద్యార్థులకు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జి.మహేంద్ర, రామాంజనేయులు, రంగన గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి గెస్ట్ టీచర్స్ వినతి

పెనుకొండ : రాష్ట్ర వ్యాప్తంగా గెస్ట్ టీచర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మహాత్మ జ్యోతి బాపూలే బిసి గురుకుల పాఠశాల అతిథి ఉపాధ్యాయ సంఘం నాయకులు బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితకు వినతి పత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రవిచంద్ర యాదవ్ మాట్లాడుతూ జీవో-23 ప్రకారం కాంట్రాక్ట్ చేయాలన్నారు. స్పందించిన మంత్రి ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డి.మురళీ మోహన్‌రెడ్డి, ఎల్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దళిత చైతన్య యాత్ర : దండు వీరయ్య

ప్రజాశక్తి-మడకశిర

నవంబర్ 26 రాజ్యాంగ రచన దినోత్సవం సందర్భంగా మంగళవారం నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకూ నియోజకవర్గంలో దళిత చైతన్య యాత్ర చేపడుతున్నట్లు ఎపి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని కోరారు. ఆయన సోమవారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరికం, అంటరానితనం పోవాలంటే దళితుల్లో చైతన్యం రావాలన్నారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మార్ హనుమంతు, నాయకులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, నరసింహులు, శ్రీనివాస్, టిఆర్.అంజప్ప, మల్లికార్జున, ఈశ్వర్, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ప్రజల సమస్యలు పరిష్కరించడానికే 'ప్రజాదర్బార్' ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. అమరాపురం తహశీల్దార్ కార్యాలయంలో సోమవా రం వారు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందులో పింఛన్లు, నూతన గృహాలు, బిల్లులు, తాగు, సాగునీరు, వన్ బి, అడంగల్, ఈ పాసు పుస్తకం, తదితర సమస్యలకు సంబంధించిన అధికంగా వినతులు అందాయని తెలిపారు. ఆయా సమస్యలను పరిశీలించి ప్రాధాన్య తాక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, ఏవో ఆరాధ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కుంచిటి వక్కలిగ సాధికార రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండు రంగప్ప, మండల కన్వీనర్ గణేష్, మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి, నాయకులు ప్రసాద్, మంజునాథ్, శివరుద్రప్ప, కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల

అసత్య ప్రచారాలు తగదు : సిపిఎం


డిఎస్‌పికి వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు, నిరుపేదలు

ప్రజాశక్తి-హిందూపురం

నిరుపేదల ఇళ్లస్థలాల సాధనకు సిపిఎం చేపట్టిన ప్రజాఉద్యమంపై అసత్య ప్రచారాలు తగదని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. సిపిఎంకి వ్యతిరేకంగా కొన్ని పత్రికల్లో పని చేస్తున్న పాత్రికేయులు చెప్పుడు మాటలు విని గత నాలుగు రోజులుగా అసత్య ప్రచారాలు చేస్తున్న విషయంపై సిపిఎం నాయకులు స్పందించారు. ఈ మేరకు వారు సోమవారం ఇంటి స్థలాల పోరాట కమిటీతో పాటు ఇల్లు లేని నిరుపేదలతో కలిసి పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయం ముందు ఆందోళన చేసి డిఎస్‌పి మహేష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జడ్‌పి. శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో వివిధ కాలనీలలో అద్దె గృహాల్లో నివాసముంటున్న నిరు పేదలు ఇంటి స్థలాల కోసం అధికారులకు, పాలకులకు విన్నవించారన్నారు. అయితే వారు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పట్టణంలోని దాదాపు 450 మంది పేదలు సిపిఎంను ఆశ్రయించారన్నారు. దీంతో సిపిఎం ఆ నిరుపేదలకు భరోసా కల్పించి ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గత 9 నెలలుగా పోరాటం చేస్తోందని చెప్పారు. అందులో భాగంగా గత సంవత్సరం డిసెంబర్ నెలలో వారితో సమావేశం నిర్వహించి ఇల్లు లేని వారందరితో సచివాలయాల్లో ఆన్ లైన్ చేయించి అనంతరం మున్సిపల్ కార్యాలయంలో, రెవెన్యూ కార్యాలయంలో, సబ్ కలెక్టర్ కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టర్‌కు సైతం అర్జీలు సమర్పించామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడంతో 8 నెలల క్రితం కొల్లకుంట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలను వేసుకుని నివాసం ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. నివాసముంటున్న ఇంటి స్థలాన్ని కేటాయించాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరుగుతూ వినతులను సమర్పించారన్నారు. గుడిసెలు వేసుకున్న స్థలంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పార్టీ సూచనల మేరకు సౌకర్యాల కోసం అక్కడ నివాసం ఉంటున్న వారే చందాలు వేసుకుని సౌకర్యాలను ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. సమస్యను అధికారులు పరిష్కరించకపోవడంతో అందరూ కలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయించినా తీర్పునివ్వలేకున్నారన్నారు. కోర్టు ఖర్చుల నిమిత్తం పోరాట కమిటీ వారే చందాలు వేసుకుని పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. అంతేకాని సిపిఎం ఏ ఒక్కరితోనూ డబ్బులను వసూలు చేయలేదన్నారు. పోరాటాలు చేస్తున్న నేపథ్యంలోనే గత అక్టోబర్ నెలలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కొంతమంది పాత్రికేయులు సిపిఎం కార్యాలయానికి వచ్చి తమకు మూడు ఎకరాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. ఆ సమయంలో పార్టీ దర్యాప్తు ఇల్లు లేని పేద కోసం గత సంవత్సరం నుండి పోరాటాలు చేస్తున్నాం, వారిని అక్కడ నుంచి ఖాళీ చేయించడం న్యాయం కాదని, ప్రధానంగా ఆ భూమి పార్టీది కాదని వివరించారన్నారు. ఇల్లు లేని పేదలు చేస్తున్న పోరాటంలో భాగస్వాములు అయితే అందరం కలిసి ఇంటి స్థలాలను ప్రభుత్వం నుంచి తీసుకుందామని వారికి సూచించామన్నారు. అప్పటి నుండి గుడిసెలను ఖాళీ చేయించాలని, లేనిపోని అసత్యాలను కొంతమంది చేస్తున్నారన్నారు. సిపిఎం క్రమశిక్షణకు మారుపేరని, ఎవరు అవినీతికి పాల్పడినా వెంటనే వారిని పార్టీ నుండి తొలగించడం జరుగుతుందని అన్నారు. లేనిది ఉన్నట్టు అసత్య ప్రచారాలు చేయడంతో పాటు వాటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న వారందరి పైన చర్యలు తీసుకోవాలని డిఎస్‌పిని వారు కోరారు. లేనిపక్షంలో పేదలతో కలిసి అసత్య ప్రచారాలు చేస్తున్న వారికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని న్యాయం చేయాలని డిఎస్‌పిని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణ, రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, ఇళ్ల పోరాట కమిటీ నాయకులు షేక్ సుమేరా, చంద్రమ్మ, సరస్వతి, సరిత, నాజియా, అజ్మతుల్లా, రామాంజి, నరసింహప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

26 ఏళ్ల క్రితం నేరం... నిందితుడు అరెస్ట్..

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

26 సంవత్సరాల మిస్టరీ కేసులో ఛేదింపు వివరాలను జిల్లా ఎస్పీ రత్న వివరించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మిస్టరీగా మారిన పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అందులో భాగంగా పెనుగొండ సబ్ డివిజన్ లో మిస్టరీగా మారిన కేసులపై డీఎస్పీ వెంకటేశ్వర్లు దృష్టి సారించి కేసుల్లో పురోగతి సాధిస్తున్నారన్నారు. గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి చెందిన గొల్ల తిప్పేస్వామి(55) 30 సంవత్సరాల క్రితం మేనత్త కూతురు కరియమ్మను వివాహం చేసుకోగా వారికి ఇద్దరు కొడుకులు కలిగారన్నారు. ఈ నేపథ్యంలో భార్యపై అనుమానంతో (6 నెలలు) చిన్నపిల్లవాడిని 1998 అక్టోబర్ రెండవ తేదీ దసరా పండగ సందర్భంగా దిన్నే హట్టి గ్రామం మారెమ్మ జమ్మి కట్ట వద్ద గొంతు పిసికి చంపి సాక్ష్యం లేకుండా చేసి పారిపోయాడన్నారు. ఈ విషయంపై కరియమ్మ ఆమె భర్త పై గుడిబండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. తిప్పేస్వామి పోలీసులకు దొరకకుండా కర్ణాటక రాష్ట్రం లోని హొసూరు సమీపంలో ఆర్థూరు అనే గ్రామంలో ఓ మహిళను వివాహం చేసుకొని అక్కడే ఉండిపోయాడన్నారు. తిప్పేస్వామి స్నేహితుడు గొల్ల నాగరాజు ఆతనితో స్నేహం కొనసాగిస్తూ వారి ఇంటికి వెళ్లేవాడన్నారు. ఈ నేపథ్యంలో తిప్పే స్వామి తన తండ్రి చిత్తప్పతో ఆస్తిపంపకాలపై మాట్లాడాడన్నారు. అందులో భాగంగా తన తమ్ముడు చెల్లెలు కలిసి పెద్ద మనుషుల సమక్షంలో భూమి పరిష్కారాలు చేసుకొనుటకు మందలపల్లి బస్టాండ్‌లో ఉండగా పోలీసులు అరెస్టు చేశారన్నారు. 26 సంవత్సరాల నుండి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసిన మడకశిర సిఐ రాజకుమార్, గుడిబండ ఎస్ఐ ముని ప్రతాప్, సిబ్బందిని జిల్లా ఎస్పీ రత్న, పెనుగొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించి రివార్డులు అందించారు.

మద్యం విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - హిందూపురం

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురునిఅరెస్టు చేసినట్లు సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. పరిగి, లేపాక్షి, హిందూపురం మండలాల్లో దాడులు నిర్వహించి నారాయణప్ప, మూర్తి, అశోక్, సీనప్పను అరెస్టు చేసి ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పేకాటజూదరులు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని వెంకటరమణపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై దాడి చేసి 15 మందిని అరెస్టు చేసినట్లు సిఐ శేఖర్ తెలిపారు. సిఐ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 1,29,160 నగదు స్వాధీనం చేసుకున్నారు. సిఐ మాట్లాడుతూ మండలంలో పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు


అహుడా ఛైర్మన్‌తో మాజీ మంత్రి పల్లె

అహుడా ఛైర్మన్‌కు పల్లె అభినందనలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అహుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన టిసి వరుణ్‌కు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన అరుణ్‌ను ఆయన కార్యాలయంలో పల్లె రఘునాథ్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు పత్తి చంద్రశేఖర్, అబ్దుల్లా ,పూల శివ, మేకల ఈశ్వర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం చేపట్టండి

ప్రజాశక్తి - తాడి మర్రి

మండలంలోని చిల్లకొండపల్లి గ్రామం వద్ద 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తుంగభద్ర వంతెన శిథిలావస్థకు చేరుకుందని ఈ వంతెన స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించాలని గ్రామ సర్పంచి జొల్లిరెడ్డి రామన్న కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఈ వంతెన ఎప్పుడు కూలిపోతుందో అన్న అందోళన ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి కొత్త వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.

కాంగ్రెస్ విజయంపై హర్షం

ప్రజాశక్తి - కదిరి టౌన్

జార్ఖండ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై ఆపార్టీకి చెందిన స్థానిక నాయకులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు కదిరప్ప మాట్లాడుతూ బిజెపి నియంతృత్వ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీ దేశంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. బిజెపికపట నీతి,మతతత్వ రాజకీయాలు పేదలకు అన్యాయం చేస్తున్నాయన్నారు. ఎన్నికలలో పెట్టుబడి దారులను ఉపయోగించుకొని విజయాలను సాధిస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీదే అధికారమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు ఉపేంద్ర, వక్కన గారి శ్రీనివాసులు, తిప్పన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No.5/2019

Between:

గుమ్మిరెడ్డి జగదీశ్వరరెడ్డి, S/o.ఆదినారాయణ రెడ్డి, డోరునెం.6-44, మిద్దివారిపల్లి, **కుమ్మరవాండ్లపల్లి** గ్రామము, కదిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...పిటీషనర్

And

కంచినేని క్రిష్ణ and 34 Others

...రెస్పాండెంట్స్

R9, R19, R21, and R26 to 29 నోటీసు

పై పిటిషన్‌లో పిటిషనర్ అయిన గుమ్మిరెడ్డి జగదీశ్వరరెడ్డి IP దాఖలు చేసుకున్నారు. సదరు పిటిషన్‌లో రెస్పాండెంట్ అయిన R9 M.శివారెడ్డి, డోరునెం. 2-782-9C లీలామహల్ Sonovision Back Side Street, తిరుపతి, చిత్తూరు జిల్లా మరియు R19 అయిన A.చైతన్య, S/o.మురళి, డోరునెం.1-923-6A, రాఘవేంద్రనగర్, కేశవం గుట్ట, తిరుపతి, చిత్తూరు జిల్లా మరియు R21 అయిన D.అవినాష్‌రెడ్డి, డోరునెం.2-560 Beside I.S.Mahal Apatments, తిరుపతి, చిత్తూరు జిల్లా మరియు R26 అయిన S.రామమోహన్, డోరునెం.1-1135-7C, ఆడపాలవీధి, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా మరియు R27 అయిన K.ఆంజనేయులు, S/o.శ్రీరాములు, డోరునెం.1-1153, అడపాల వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా మరియు R28 అయిన S.హైదరవలి, డోరునెం.1-11-235-5C Near Nana Dargah Kadiri Town, శ్రీ సత్యసాయి జిల్లా మరియు R29 అయిన బాబ్ జాన్ S/o.సుభహాన్, డోరునెం.10-456-C7, రాయచోటి రోడ్డు, కదిరి టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా అయిన మీ అందరికి తెలియజేయడం ఏమనగా పై I.P పిటిషనర్ మీ హాజరు నిమిత్తం **4-12-2024**వ తేదీన ఉదయం 10.30 గం॥లకు వాయిదా ఉన్నది. సదరు తేదీ నాడు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాన పైకోర్టులో హాజరు అయి ఆక్షేపణలు వున్న ఎడల తెలుపు కొనవలయును. లేనిచో ఘనమైన కోర్టు వారు పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 4-12-2024

బి.రామమోహన్‌రెడ్డి B.A., B.L.
పిటిషనర్ న్యాయవాది, కదిరి,
శ్రీసత్యసాయి జిల్లా.

విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి సాధించాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - బత్తలపల్లి

విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటుకొత్త కొత్త విషయాలు తెలుసుకోవడంపై ఆసక్తి కనబరచాలని, నైపుణ్యాభివృద్ధి సాధించినప్పుడే సమాజంలో రాణించగలరని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సంజీవపురం వద్దగల కెజిబివిలో రూ. 74.84 లక్షల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు కూటమి నేతలతో కలిసి మంత్రి పూజ చేశారు. అనంతరం కెజిబివి ఎస్ఒ గుల్జార్ బేగం అధ్యక్షతన జరిగిన విద్యార్థుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్య పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వలేదని నైపుణ్యం కలిగిన వారు వివిధ రంగాలలోనూ రాణించాలని కోరారు. చిన్నప్పటినుండి పాఠ్యపుస్తకాలలోనివి చదడమే కాకుండా లైబ్రరీలోకి వెళ్లి నాటి నేటి చరిత్రను తెలిపే పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు విజ్ఞానవంతులయితే కుటుంబంతోపాటు దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెలుగు భాషతోపాటు ఇంగ్లీష్ భాష పై కూడా ప్రావీణ్యం సంపాదించుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కల నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు జనసేన ధర్మవరం ఇన్‌చార్జి చిలకం మధుసూదన్ రెడ్డి, కూటమి నాయకులు సంధిరెడ్డి శ్రీనివాసులు, ధర్మవరం ఆర్డీవో మహేష్,సమగ్ర శిక్ష బాలికా సంరక్షణ అధికారి(జీసీడిఒ) సంపూర్ణ, డిఇఒ చిదంబరప్ప, తహశీల్దార్ స్వర్ణలత, ఎంపీడీవో నరసింహానాయుడు, ఈవోఆర్డీ క్రిష్టప్ప, మండల విద్యా శాఖాధికారులు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రధాన ధ్యేయం : మంత్రి సవిత


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - పరిగి

రైతు శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని పైడేటి సమీపంలో 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు మంత్రి సవిత సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మరికొన్ని ప్రాంతాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు అవసరం ఉందని వీలైనంత త్వరగా మరికొన్ని సబ్ స్టేషన్ల ఏర్పాటుకు భూమిని సేకరిస్తామని చెప్పారు. పెనుగొండ కేంద్రంగా విద్యుత్ స్తంభాల తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ఆమె తెలిపారు. పైడేటి వద్ద ఏర్పాటు చేస్తున్న సబ్ స్టేషన్ ద్వారా సుమారు 11 గ్రామాలలో గల 2,596 గృహ, వాణిజ్య, 870 వ్యయసాయ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి వీలు అవుతుందని చెప్పారు. వంద రోజుల లోపల పని పూర్తి అవడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అనంతరం పరిగి మండల కేంద్రంలోని వీర లింగేశ్వర స్వామి కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతులను అర్జీదారుల నుండి స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థతోపాటు తాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాలలో సచివాలయ వ్యవస్థపై పలువురు ఎంపీడీవో పనితీరును మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆమె ఎంపీడీవో శ్రీధర్‌ను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ఆర్డీవో ఆనందరావు, విద్యుత్‌శాఖ ఎస్ఇ సురేంద్ర, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, విద్యుత్ డిఈ భూపతి, తహశీల్దార్ హసీనాసుల్తానా, టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, సర్పంచి బాలాజీ, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ తదితరులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

కలెక్టర్ టిఎస్. చేతన్


సమస్య వింటున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ లో ప్రజలనుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఒ విజయ్ సారథి ఆర్‌డిఒ సువర్ణ, డిపిఒ సమత, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్లక్ష్యంతో చేయకుండా ప్రతి శాఖ అధికారి మానిటరింగ్ చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు చెల్లించ లేదనే కారణంగా డిగ్రీ ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్‌ను నిరాకరించడం తరగతులకు హాజరుకాకుండా అడ్డుకోవడం లాంటి చర్యలకు పాల్పడితే సంబంధిత యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లింగ వివక్ష వ్యతిరేక ప్రచార కార్యక్రమాలు : లింగ వివక్షత వ్యతిరేక జాతీయ ప్రచార కార్యక్రమాలు విజయవంతం చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జండర్ అథారిటీ హింసపై పోరాటం గురించి రూపొందించిన ప్రచార గోడపత్రికలను విడుదల చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో లింగ వివక్షతపై డిసెంబర్ 23 వరకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలు ఇతర ప్రభుత్వ విభాగాల స్వచ్ఛంద సంస్థలు సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలోల పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీని నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సరోజ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్, నాయకులు సాంబశివ తదితరులు మాట్లాడారు. నాలుగు నెలలుగా వర్కర్లకు వేతనాలు పెండింగ్‌లోఉన్నాయన్నారు. కేవలం 6వేల రూపాయల వేతనంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్నారన్నారు. వారికి కనీస వేతన చట్ట ప్రకారం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, వర్కర్లకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని శానిటేషన్ పరికరాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఆయాల యూనియన్ నాయకులు సాంబశివ, నాగమణి, చౌడమ్మ, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న శానిటేషన్ వర్కర్లు, నాయకులు


ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ఐదోరోజుకు పంచాయతీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ముదిగుబ్బ

తమ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ముదిగుబ్బ మేజర్ పంచాయతీ లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు 2016 నుంచి ఆర్డర్ కాపీ ఇవ్వలేదన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలని కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, టైలర్ ముస్తఫా,రఫీ, నౌషాద్, వెంగముని, పంచాయతీ కార్మికులు, వాటర్ మ్యాన్లు బాషా, కిరణ్, ఆదినారాయణ, ఓబులేసు, సావిత్రి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలు పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఆర్ఎంపిలు వారి పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించారు. అనంతరం ఎంఇఎంఒ డాక్టర్ బాబా ఫక్రుద్దీన్, ముదిగుబ్బ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్వేతతో కలసి విలేకరులతో మాట్లాడారు. ముదిగుబ్బలో ఒక ఆర్ఎంపి తన పరిధి దాటి వైద్యం చేయడం వల్ల తన ఆరోగ్యం పూర్తిస్థాయిలో క్షీణించిందని దొరిగల్లు ప్రాంతానికి చెందిన రమణ అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు తాము విచారణకు వచ్చామన్నారు. బాధితుడికి చికిత్స అందించిన ఆర్ఎంపి ఇందుకూరు బాషాను విచారించి ఆర్ఎంపి పరిధి గురించి అవగాహన కల్పించామన్నారు. జరిగిన సంఘటన గురించి ఉన్నతాధికారులకు నివేదిక అందివ్వనున్నట్లు తెలిపారు. ముదిగుబ్బలో 20 మందికి పైగా ఆర్ఎంపిలుఉన్నట్లు గుర్తించామని వీరందరూ పరిధికి మించి వైద్యం అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. వీరివల్ల చికిత్స వికటించిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా అనుమతులు లేని ల్యాబ్‌లపై త్వరలో దాడులు నిర్వహించి సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ల్యాబ్ నిర్వాహకులు అధికంగా డబ్బులు వసూలు చేసిన చర్యలు తీసుకుంటామన్నారు.

బెల్ట్‌షాపులకు మద్యం ఇస్తే లైసెన్సు రద్దు

ప్రజాశక్తి-హిందూపురం

మద్యం దుకాణాల యజమానులు బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే వారి దుకాణాల అనుమతులను రద్దు చేస్తామని ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం హిందూపురం పట్టణంలోని పలు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న మద్యం స్టాకు వివరాలు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేసినా, అధిక ధరలకు మద్యం విక్రయించినా కేసులు నమోదు చేసి, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

'మీ సేవలో - మీ ప్రభుత్వం'

ప్రజాశక్తి - బత్తలపల్లి


కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు, కాలనీవాసులు

మండల కేంద్రమైన బత్తలపల్లిలో టిడిపి నాయకులు సోమవారం 'మీ సేవలో మీ ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలనీ వాసులు తమ సమస్యలను నాయకులకు విన్నవించారు. పింఛను, రేషన్‌కార్డు, ఇంటిస్థలం, పక్కాగృహం, వీధిలైట్లు తదితర అంశాలపై అర్జీలు సమర్పించారు. గతం ప్రభుత్వ హయాంలో చాలా సార్లు తమ సమస్యలు విన్నవించుకున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోయారు. మీరైనా న్యాయం చేయాలని నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, జక్కంపూటి నాగభూషణ,కాలనీ నాయకుడు పాముల పెద్దన్న, ముతవల్లి సులేమాన్, సుబహాన్, గుండు సాబ్, శ్రీరాములు, చంద్రశేఖర్, హరి, మోహన, వడ్డే బొజ్జప్ప, ఐటీడీపి హరిప్రసాద్, సల్మాన్, కుళ్లాయప్ప, కాసప్ప తదితరులు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌ను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి అర్బన్

భారత ప్రభుత్వం,యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, బ్లూమూన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 వ తేదీన బ్లూమూన్ విద్యాసంస్థలలో జరగనున్న జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్, శివశంకర్ నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇంచార్జ్ శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసతి భరత్‌తో కలసి యువ ఉత్సవ్ కార్యక్రమానికి సంబందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువ కార్యకర్తలు జై మారుతి, పి. వెంకటేష్, వాసుదేవ్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు నాగరాజు కోరారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలసి ధర్నాకు సంబందించిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగిరెడ్డి, రమణ, చిన్న మల్లి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదు అవసరం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

విద్యార్థులు అపార్ కార్డులు నమోదు చేసుకోవాలని మండల విద్యాధికారి సుబ్బిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అపార్ కార్డును ఏ రుసుము లేకుండా విద్యార్థిని విద్యార్థులు నమోదు చేసుకొనుటకు జిల్లా ఉన్నతాధికారి సడలింపు ఇచ్చారని తెలిపారు. ఇప్పటివరకు 65 శాతం మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని,ఇంకా మండల పరిధిలో వెయ్యి మంది పిల్లలు నమోదు చేసుకోవాల్సి ఉందని చెప్పారు. వీరు కూడా ఈ నెలాఖరులోపు నమోదు చేసుకునేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయం 2 లో ఆధార్ నమోదుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని పోట్లమర్రి గ్రామంలో వరి పంటలో పంటకోత ప్రయోగాలను సోమవారం నిర్వహించారు. ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బిల్లే నాగరాజు సాగు చేసిన వరి పంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఎస్ఎ ముత్యాలప్ప, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ చంద్రమోహన్, మనోజ్, మంజునాథ పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - బత్తలపల్లి

సమాచార హక్కు చట్టం ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్టీఐ(సమాచార హక్కు చట్టం) ప్రజా సంరక్షణ వేదిక సభ్యులు మండల అధికారులను కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ స్వర్ణలత, ఎంపీడీవో నరసింహనాయుడును కలిసి సహచట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ(సమాచార హక్కు చట్టం) ప్రజా సంరక్షణ వేదిక సభ్యులు శ్రీనివాసులు, గోపి, చెన్న ఆదినారాయణ, కొండప్ప తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - బత్తలపల్లి

తపాలా శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలపై ఆ శాఖ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కలిగించడానికి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలో పోస్టల్ శాఖ మెయిల్ ఓవర్ సీర్ టీం లీడర్ బుడ్డన్న ఆధ్వర్యంలో తపాలాశాఖ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి పోస్ట్మాస్టర్ కమ్మన్న, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు మాణిక, మాలిని, పావని, పోస్టల్ సిబ్బంది మాల్యవంతం ప్రకాష్ నాయుడు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల నుంచి వినతులను తీసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ బలరామిరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దష్టికి తీసుకురావాలని, వాటిని అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తాననితెలిపారు. అనంతరం ఆయన పైప్ లైన్ రోడ్డులో జరుగుతున్న రహదారి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు ఉన్నారు.

ఆప్టా నూతన కార్యవర్గం ఏర్పాటు

పుట్టపర్తి క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. స్థానిక ఆప్టా కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా నంబూరి వెంకటనాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్ గా పి.చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి,జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా వై.అంజనమూర్తి, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా శివసంపత్ కుమార్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా జిల్లా కార్యదర్శులుగా ఐదుగురిని, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఏడుగురుని ఎన్నుకున్నారు.

జాతీయ చిత్రలేఖనం పోటీలో 'అనంతలక్ష్మి' ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలలో భారతీయ కళలు, వారసత్వ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీల్లో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఛైర్మన్ అనంత రాముడు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎ.ప్రజ్ఞ చిత్రీకరించిన సంస్కృతి వారసత్వ చిత్రానికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి వచ్చినట్లు తెలిపారు. ఈ చిత్రంలో మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసిన విద్యార్థి ప్రజ్ఞను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఎఒ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో 'నారాయణ' విద్యార్థిని ప్రతిభ

అనంతపురం : కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న నారాయణ పాఠశాల విద్యార్థిని లిఖిత క్లాసికల్ డాన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి స్పార్క్ ఆఫ్ ట్రెడిషన్స్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికైనట్లు ఎజిఎం సుధాకర్‌రెడ్డి తెలిపారు. గుంతకల్లులోని శ్రీవాగ్దేవి విద్యా సంగీత కళా నృత్యం సంస్కృతి సంస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీల్లో లిఖిత విజేతగా నిలిచిందన్నారు. దీంతో స్థానిక పాఠశాలల్లో విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాధానాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను గౌరవిద్దాం



గాండ్లపెంటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

సమాజంలో మహిళలను గౌరవిద్దామని ధర్మవరం కోర్టులోని న్యాయవాది బాల త్రిపుర సుందరి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీటి ఫీల్డ్ కార్యాలయంలో 'అంతర్జాతీయ స్త్రీహింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఎటి లీడర్ నారాయణమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాల త్రిపుర సుందరి, ఉమెన్స్ కోఆపరేటివ్ మెంబర్ రాధ, మీ సేవ హరికృష్ణ, గంటాపురం అమృత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్ల పుట్టినప్పుటి నుంచి చనిపోయే వరకు హింసకు గురవుతోందని వాపోయారు. మగవారే హింసకు కారణం కాదని స్త్రీలు కూడా కారణమేనని వివరించారు. ఈసందర్భంగా మహిళా చట్టాలు, తదితర చట్టాల గురించి వివరించారు. అంతకు ముందు సోషియల్ కమిటీ సభ్యులు బాల్యవివాహాలు, అడపిల్లలు చదువులు, లైంగిక వేధింపులు తదితర వాటిపై వివరించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ రుక్మాంగద, రీజనల్ ఇంజనీర్ మధు, కౌన్సిలర్ శోభారాణి, సీతులు నాగరాజు, వెంకటేష్ అకౌంటెంట్ జయలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక ఆర్‌డిటి కార్యాలయంలో సోమవారం స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ కృష్ణనాయక్, కదిరి సిడిపిఒ గంగ రత్నమ్మ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ బాషా, ఎస్‌టిఎల్ రాంప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ సీతమ్మ, సిఒ గంగాధర్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏరియా టీం లీడర్ కృష్ణ అధ్యక్షతన అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్ఐ ఇషాక్ బాషా, ఎపిఎం హేమలత మాట్లాడుతూ సమాజం అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందుతున్నా మహిళల పట్ల హింసలు అరాచకాలు దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయని వాపోయారు. సమాజంలో అన్ని రంగాలలోనూ మహిళలకు వారి స్థానాలు కల్పించి వారిని గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ముదిగుబ్బలోని కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు

మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ధర్మవరం పట్టణ పురపాలక సంఘంలో పనిచేస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ధర్మవరం పురపాలక సంఘంలో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో సి.బాబు, ఆర్. మల్లికార్జున, డి. నాగేంద్ర, సి. మహబూబ్ బాషా అనే కార్మికులు మృతి చెందారన్నారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ప్రభుత్వం స్పందించి మృతి చెందిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శులు పైపల్లి గంగాధర్, పెదపల్లి బాబా, మున్సిపల్ కార్మికులు ముకుంద, ఓబులేసు, జాఫర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన..

పాఠశాలల్లో పనివేళలు మార్పు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల పనివేళలను మంగళవారం నుంచి మార్పు చేస్తున్నట్లు డీఈవో కిష్టప్ప తెలిపారు. జిల్లాలోని 32 మండలాల్లోని పాఠశాలల్లో ఒక్కో ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి ఆ పాఠశాలలో పనివేళలను మార్చుతున్నామన్నారు. ఆ పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ మేరకు ఆయా మండలాల ఎంఈవోలు, పాఠశాల హెచ్ఎమ్‌లకు వివరాలు పంపామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆయా పాఠశాలలు నూతన పనివేళలను పాటించాలని ఆదేశించారు. ఈ విధానంలో ఉన్న లోటుపాట్లను గ్రహించి విద్యార్థులు ఉపాధ్యాయులు అధ్యయనం చేసిన తర్వాత నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

వ్యాసరచన పోటీల్లో ఎస్‌డిజిఎస్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల నిర్వాహకులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకుని స్థానిక ఎస్.డి.జి.ఎస్ కళాశాలలో అన్ని పాఠశాల, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో ఎస్ డి జి ఎస్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. మండల స్థాయి తెలుగు మాధ్యమంలో భీమశెట్టి ఝాన్సీ రాణి, ఆంగ్ల మాధ్యమంలో యఫ్. అలియా భానుకు బహుమతులు రావడం హర్షణీయమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. అలాగే సత్య సాయి జయంతి వేడుకల భాగంలో జిల్లా స్థాయి లో కూడా తెలుగు మాధ్యమంలో తృతీయ బహుమతి భీమశెట్టి ఝాన్సీరాణికి, ఆంగ్ల మాధ్యమంలో ద్వితీయ బహుమతి యఫ్. అలియా భానుకు రావడం ఎంతో గర్వకారణమన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జె.ఎస్.వి.ఎస్ ప్రసాద్, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ రాజన్న, ఎన్‌సిసి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై సమగ్ర సర్వే

ప్రజాశక్తి - బుక్కపట్నం

జిల్లాలోని పిల్లల విద్యా స్థాయి, పాఠశాల మౌలిక వసతులపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు సత్యసాయి జిల్లా విద్యాధికారి కిష్టప్ప తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన విద్యా ప్రమాణాలపై సర్వే చేసే విద్యార్థులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ నేషనల్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో డైట్ కాలేజ్, ఇతర కాలేజీల నుంచి 106 మంది విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డిసెంబర్ 4వ తేదీన జిల్లాలోని 23 మండలాల నుంచి 93 పాఠశాలలో 3, 6, 9 తరగతి పాఠశాల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్,గణితం, సైన్స్, సోషియల్ నందు విద్యార్థుల విద్య స్థాయిని పరిశీలించి, ఫలితాలపై సమీక్షించి,విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరగడానికి, పాఠశాలలోని మౌలిక వసతులపై తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక అందిస్తారని చెప్పారు. సర్వే ఆధారంగా ఎన్‌సిఆర్‌టి తగిన చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధారణ పరీక్ష సెక్రటరీ భాస్కర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ, రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ విద్యార్థులకు వరం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్


హాజరైన యువత, అధికారులు

ప్రజాశక్తి - అనంతపురం

రాబోయే 5 సంవత్సరాల్లో దేశంలోని టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రారంభమైందని పథకం ప్రకటించాగానే 24 గంటల్లో 1.55 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం విశేషమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అనంతపురం జెఎన్‌టియులో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి సత్య కుమార్‌తో పాటు బిజెపి యువ మోర్చా అధ్యక్షులు శ్రీ మిట్ట వంశీ కృష్ణ , జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024 బడ్జెట్‌లో ప్రకటించిన 'ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం'ను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే అన్నారు. ఈ పథకం కింద అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ అక్టోబర్ 12 నుంచి ప్రారంభమైందని అయితే ఇంటర్న్‌షిప్ స్కీమ్ పోర్టల్ ప్రారంభించిన 24 గంటల్లో నమోదు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 1,55,109కి చేరిందని చెప్పారు. మన దేశంలోని 500 అగ్రగామి కంపెనీల్లో 12 నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు ఈ పథకం అవకాశం కల్పిస్తుందని అన్నారు. ఇప్పటివరకు, జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్, మారుతీ సుజుకి ఇండియా, ఐషర్ మోటార్ లిమిటెడ్, లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి 193 కంపెనీలు ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పిస్తున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా యువతో ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ముఖ్యంగా చమురు, గ్యాస్, ఇంధన రంగంలో ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే ట్రావెల్, టూరిజం, ఆటోమోటివ్, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, కార్యకలాపాల నిర్వహణ, ఉత్పత్తి, తయారీ, నిర్వహణ, అమ్మకాలు, మార్కెటింగ్‌తో సహా 20 కంటే ఎక్కువ రంగాలలో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ పథకం ద్వారా 12 నెలల పాటు దేశంలోని టాప్ కంపెనీలలో పనిచేసే అవకాశం లభిస్తుందని వారు ప్రభుత్వం నుంచి నెలవారీగా రూ.4,500, కంపెనీ నుంచి రూ.5000 స్టైఫండ్ అందుకుంటారన్నారు. అలాగే రూ.6,000 వన్-టైమ్ గ్రాంట్‌కు కూడా అర్హులన్నారు. ప్రతి ఇంటర్న్ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద బీమా కవరేజీకి అర్హులు అని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా కార్యదర్శి అజేష్ యాదవ్,యువ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ సూర్య ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరీష్ రెడ్డి, సీనియర్ నాయకులు లలిత్ కుమార్, చిరంజీవి రెడ్డి, యువ మోర్చా ఉపాధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, మనోహర్, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ రెడ్డి, కార్యదర్శి కుళ్లాయ్ యాదవ్,సింగనమల సభ్యత్వ నమోదు ఇంచార్జ్ గంగ రాజేష్ రెడ్డి,శ్రీనాథ్,ఎస్సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి శాంత కుమార్, రాష్ట్ర ఓబీసీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ అశోక్ చక్రవర్తి,అరవింద్, వర్మ, హరి,కొండా రెడ్డి, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం లోని డిఎస్‌డిఎ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 24, 25వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ కనపర్చారు.కరాటే విభాగం నుంచి హిందూపురానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు శిక్షకులు తెలిపారు. కరాటే శిక్షకులు సెన్సేయి ఫైరోజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 15 మంది విద్యార్థులలో శోభన్, నేహా, బిందు శ్రీ, భావన, యాలిని ద్వితీయ స్థానాలను, జాయిద్, యాసిని, దేవ తృతీయ స్థానాలను సాధించారని తెలిపారు.


ప్రతిభా విద్యార్థులతో కరాటే మాస్టర్లు


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సుంకు చంద్రశేఖర్

పుట్టపర్తి వాసికి డాక్టరేట్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ ఉపాధ్యక్షులు, పుట్టపర్తి నివాసి సుంకు చంద్రశేఖర్ గుప్తాకు డాక్టరేట్ దక్కింది. ఈ విషయాన్ని ఆయన సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. తాను 20 సంవత్సరాలుగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చేసిన సేవలను గుర్తించి ఆదివారం న్యూఢిల్లీలో తీన్ మూర్తి భవన్ నెహ్రూ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాల్ లో వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. డాక్టరేట్ పొందడం వల్ల తనకు మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నట్లు ఉపసర్పంచి కోటి గోపీనాథ్ పేర్కొన్నారు. కొన్ని నెలలుగా కాలనీ ప్రజలు తాగునీటి కష్టాలు పడుతున్నారన్నారు. సమస్యను గుర్తించి బోరుబావి తవ్వించినట్లు చెప్పారు. ఈ మేరకు బోరుబావికి సోమవారం మోటరు అమర్చామన్నారు. దీంతో కాలనీలో నీటి సమస్య తీరనున్నదన్నారు. దీంతో పాటు పాతఊరు లోని పాతపంచాయతీ కార్యాలయం వద్ద కూడా బోరుబావిని తవ్వించామని చెప్పారు.


బోరుబావి తవ్వకం

గ్రంథాలయ పన్ను చెల్లించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లాలోని గ్రంథాలయాలకు గ్రామ పంచాయతీలు ద్వారా వచ్చే పన్నులను సకాలంలో చెల్లించాలని జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో గ్రామపంచాయతీలు పన్నులు చెల్లించకపోవడం వలన గ్రంథాలయాలను నిర్వహించడం ఇబ్బందికరంగా ఉందన్నారు. ఆయా గ్రామపంచాయతీలో పన్నులు వసూలు చేసి గ్రంథాలయాలకు రావలసిన పనులను తక్షణమే చెల్లించాలన్నారు. అక్టోబర్ నెలలో ఉద్యోగులకు రావలసిన వేతనాలు ఇంతవరకు రాలేదని ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు జీరో వన్ జీరో కింద వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి


ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

బీసీల కులగనన చేపట్టి బీసీ కులాలకు ఉన్న 33 రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ నాయకులు సోమవారం ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొని అక్కడ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, గౌరవాధ్యక్షులు సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ కులగణన జరిగితే బీసీలకు రావాల్సిన హక్కులు వస్తాయన్నారు. 33శాతం రిజర్వేషన్లు అమలతో పాటు రాజకీయ భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు రక్షణ చట్టం చేస్తామని హామీ ఇచ్చారని, అదేవిధంగా కులగణన చేపట్టి బీసీలకు రావాల్సిన హక్కులు, రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి వెంకటేశు, రవి, తిరుపాలు, జంగం కొండయ్య, నాగేంద్ర, మల్లప్ప, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - బుక్కపట్నం

రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మలిరెడ్డి అన్నారు. ఈ మేరకు వారు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం సభ్యత్వం తీసుకున్న వారికి బీమా సౌకర్యం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గంగాధర్, నాయకులు రాజశేఖర్ గౌడ్, వెంకట రాముడు,లావణ్య గౌడ్, నాగరాజు, మంజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ కార్డులు చూపుతున్న కార్యకర్తలు

అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐగా శివరాముడు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సిఐగా శివరాముడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ముదిగుబ్బ, నల్లమాడ, అనంతపురం, తదితర ప్రాంతాలలో పనిచేశారు. ఈయన ప్రస్తుతం కూడేరు నుండి ముదిగుబ్బకు బదిలీ అయ్యారు.

జిల్లేడు బండ ప్రాజెక్టు గురించి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలీదా : సిపిఐ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామ సమీపాన చేపడుతున్న జిల్లేడు బండ ప్రాజెక్టు నిర్మాణం దాని లోటుపాట్ల, డ్యామ్ ప్రయోజనాలు గురించి కూటమి నాయకులకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా అని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాజెక్టు నిర్మాణం వలన భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలని సంబంధిత రైతులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కూటమి నాయకులు, మంత్రి, ఎమ్మెల్యే తదితరులు ఆదివారం ఇక్కడికి వచ్చి బాధిత రైతులతో పరిహారం గురించి మాట్లాడకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణం అనాలోచిత నిర్ణయమని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి సత్య కుమార్ మాట్లాడిన మాటల వలన తమకు ఇప్పట్లో నష్టపరిహారం వస్తుందో రాదోనని నిర్వాసితులు తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇవేమీ పట్టించుకోని కూటమి నాయకులు ఇప్పుడు డ్యాం గురించి ఇలా మాట్లాడ్డం సరికాదని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు డ్యామ్ నిర్మాణంతో సంబంధం లేకుండా తక్షణమే ఎకరాకు రూ. 15 లక్షలు నష్టపరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - కదిరి టౌన్

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ వీరారెడ్డి సూచించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్, కదిరి సిఐ వీరా రెడ్డి , ఎస్ శ్రీధర్ ఆధ్వర్యంలో కదిరిలోని ఎస్‌టిఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు, నాటు సారాయి, అక్రమ మద్యం, అక్రమ రవాణా గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాగంగా కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలు, నాటు సారాయి, అక్రమ మద్యం, అక్రమ రవాణా వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం భవిష్యత్తులో మాదకద్రవ్యాలను వాడబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత , కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

విజయవాడలోని చెన్నూపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం ఈనెల 24న జరిగిన 7 వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్కయ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ప్రభుత్వ పాఠశాల నుండి రోషిని బంగారు పతకాన్ని, శ్రీ శాంతినికేతన్ పాఠశాల నుండి రిదా ముస్కాన్ బంగారు పతకాన్ని, జైన్ పాఠశాల నుండి జోయా ఫాతిమా రజిత పతకాన్ని, సాధన పాఠశాల నుండి రిషిత రజత పతకాన్ని సాధించారు. బంగారు పతకాలు సాధించిన రిదా ముస్కాన్,రోషిని డిసెంబర్ 7 వ తేదీ నుండి 9 వరకు హర్యానా రాష్ట్రం పంచకుల ప్రాంతంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ప్రతిభా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు, అధికారులు